వైభవంగా సంక్రాంతి సంబరాలు


తుని సంక్రాంతి సంబరాల్లో ఆకట్టుకున్న రంగ వల్లికలు


సంక్రాంతి సంబరాల్లో మాట్లాడుతున్న మంత్రి రాజా

తుని: స్థానిక రాజా కళాశాల మైదానంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ముఖ్య అతిథిగా హాజరై సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలు అందరినీ అలరించాయి. గంగి రెద్దులు, హరిదాసు, ఎడ్లబండి, రంగ వల్లికలు, గాలిపటాలు, నృత్యాలు చూపరులను అమితంగా ఆకట్టుకున్నాయి.


భోగి మంట దగ్గర సంప్రదాయ పద్ధతిలో నృత్యాలు చేస్తున్న ప్రజా ప్రతినిధులు


ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఎడ్ల బండి

జగ్గంపేటలో హ్యాట్రిక్ ఖాయం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- గోకవరంలో ఆత్మీయ సమావేశం
- కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న తోట నరసింహం


సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

గోకవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో జగ్గంపేట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని మాజీ ఎంపీ, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. గోకవరం శివారున గోపీకృష్ణ ఫంక్షన్ హాలులో శుక్రవారం పార్టీ నాయకుడు దాసరి చినబాబు ఆధ్వర్యంలో మండల స్థాయి పార్టీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తోట నరసింహం ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ జనరంజక పాలన అందిస్తుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వచ్చే ఎన్నికల్లో భారీ మెజారీతో పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. తాను 2004, 2009లో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జగ్గంపేట నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పని చేశానన్నారు. ఆ సమయంలో వైఎస్ చలవతో నియోజకవర్గంలో తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం, ఏజెన్సీలో ముసురుమిల్లి ప్రాజెక్టులు ఏర్పాటు చేయడం వలన నియోజకవర్గం సస్యశ్యామలంగా ఉందన్నారు. నియోజకవర్గానికి ప్రాజెక్టులు తీసుకువచ్చామని ప్రతిపక్షాలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యకర్తలు, అభిమానుల దీవెనలతో తాను తిరిగి సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజల్లోకి వచ్చానన్నారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. త్వరలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పార్టీ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ యువ నాయకుడు తోట రాంజీ, నాయకుడు సుంకర వీరబాబు, జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, మండల కన్వీనర్ పాటి రాంబాబు, రామచంద్రపురం ఎన్నికల పరిశీలకుడు ఒమ్మి రఘురాం, గోకవరం, గండేపల్లి ఎంపీపీలు సుంకర శ్రీవల్లి, చలగళ్ల దొరబాబు, సీహెచ్‌సీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, వైస్ ఎంపీపీలు మడికి మైనర్‌బాబు, గోకాడ చిట్టిబాబు, నాయకులు సుంకర వెంకటరమణ, సమ్మెటి మోహన్, నరాలశెట్టి నర్సయ్య, అత్తులూరి సాయిబాబు, వక్ఫ్ బోర్డు సభ్యుడు ఎస్ఎస్ ఆలీషా తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

కిర్లంపూడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. మండలంలోని రామచంద్రపురంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఆరిశ సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతిఒక్కరూ సమన్వయంలతో పని చేయాలన్నారు. పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువనేత తోట రాంజీ, తోట బాబ్జీ, తోట అయ్య న్న, ఓలేటి రాజు, బేరి బాబ్జి, అరబోలు వాసు, పాటంశెట్టి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలసిన 'వరుపుల'


జిల్లా కలెక్టర్‌కు కృతికా శుక్లాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు శుక్రవారం జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాద పూర్వకంగా కలిశారు. కాకినాడ కలెక్టరేట్‌లో ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను ఆయన కలుసుకున్నారు. ఆయన వెంట వరుపుల సూరిబాబు, పార్టీ నాయకులు ఉన్నారు.

పేదలకూ కార్పొరేట్ వైద్యం


కాట్రావులపల్లిలో పేదలకు మందులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జగ్గంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలకు సైతం కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. మండలంలోని కాట్రావులపల్లిలో శుక్రవారం రెండోవిడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆరోగ్య సురక్ష మొదటి విడతలో లక్షల మందికి మెరుగైన వైద్యసేవలు అందాయన్నారు. ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిట్టా సుగణరావు, ఎంపీటీసీ మలిరెడ్డి సత్తిబాబు, ఈఓపీఆర్డీ కొండలరావు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు ఆమోదం


సమావేశంలో శాఖల పనితీరును వివరిస్తున్న అధికారులు

ఏలేశ్వరం: పట్టణంలో చేపట్టే పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులను సభ్యులు ఆమోదించారు. సభ్యులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ అధికారులను ఆదేశించారు. తొలుత బడ్జెట్ సమావేశం జరిగింది. కార్యక్రమంలో కమిషనర్ కె.శ్రీనివాసరావు, వైస్‌చైర్ పర్సన్లు శిడగం త్రివేణి, మసిరపు బుజ్జి కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలందరికీ మెరుగైన వైద్యం

శంఖవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు ఎంపీపీ పర్వత రాజబాబు అన్నారు. మండలంలోని వజ్రకూటంలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తారన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రజలందరికీ ప్రభుత్వం మెరుగైన వైద్యం అందిస్తోందన్నారు. ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సకురు గుర్రాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరాల శ్రీను, అడపా సోమేష్, వైద్యుడు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

జగ్గంపేట: గ్రామ శివారు రంగవల్లి నగర్‌లో అగ్ని ప్రమాద బాధితులకు అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్ వెస్లీ అన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి తోట నరసింహం సూచన మేరకు క్రిస్టియన్ మైనార్టీ సంస్థ ఆధ్వర్యంలో బాధితులకు నిత్యావసర వస్తువులు, బియ్యం పంపిణీ చేశారు. బాధితులకు పక్కా ఇళ్లు కట్టించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జార్జిబాబు, సురేంద్ర, సుదర్శన్, పాల్గొన్నారు.

సంక్షిప్తం..

రైలులో కడుపు నొప్పి తాళలేక బంగ్లాదేశ్ వాసి మృతి

తుని: చెన్నైలో వైద్యం కోసం కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్తుండగా మార్గమధ్యంలో కడుపునొప్పికి గురై మరణించిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై అబ్దుల్ మారూఫ్ తెలిపిన వివరాల ప్రకారం షాలిమార్ నుంచి చెన్నై వెళ్తున్న కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో బంగ్లాదేశ్‌కు చెందిన మహ్మద్ ఆలంగిర్ హుస్సేన్(36) తన మేనమామ కుమారునితో వై ద్యం కోసం వెళ్తున్నారు. తుని సమీపంలోకి రైలు చేరుకునే సరికి హుస్సేన్‌కు కడుపులో గ్యాస్ స మస్య తలెత్తి నొప్పి తీవ్రంగా రావంతో రైలు ను తుని రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. అపస్మార క స్థితిలో ఉన్న అతడిని తుని రైల్వే ఆస్పత్రికి తీసుకెళ్లారు. వెంటనే వైద్యుడు పరిశీలించి అప్పటికే హుస్సేన్ మృతి చెందినట్టు నిర్ధారించారు. దీనిపై ఎస్సై అబ్దుల్‌మారూఫ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా హుస్సేన్ పాస్‌పోర్టు, వీసా పరిశీలించి మృతుని బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రిలో మార్చురీకి పంపించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గోకవరం: కారును బైక్ ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందినట్టు గోకవరం పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే...రంపచోడవరం మండలం తామరపల్లికి చెందిన కుంజం అఖిల్‌కుమార్ (28) బైక్‌పై రంపచోడవరం వైపు నుంచి గోకవరం వైపు వస్తుండగా బీఎస్ఆర్ కళాశాల సమీపంలో ఎదురుగా వస్తున్న కారుని ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న గోకవరం పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై ఎస్సై యువి శివనాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ..

తొండంగి: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు తొండంగి ఎస్సై వినయ్‌ప్రతాప్ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని ఎ.కొత్తపల్లి గ్రామానికి చెందిన పసపులేటి రవికుమార్ (33) ఇంటి నిర్మాణం నిమిత్తం అప్పులు చేశాడు. వడ్డీలు పెరగడంతో అప్పుల బాధ తాళలేక ఈ నెల 8న ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు తునిలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీనిపై మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అల్లిపూడి ఎంపీటీసీ నాగమణి మృతి


నాగమణి (ఫైల్)

కోటనందూరు: మండలంలోని అల్లిపూడి ఎంపీటీసీ నెమ్మది నాగమణి (40) శుక్రవారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. ఆమె మృతికి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, ఎంపీపీ లగుడు శ్రీనివాస్, అల్లిపూడి సర్పంచ్ నూకాలమ్మ సంతాపం తెలిపారు.

ఎనిమిది మంది బైండోవర్

తొండంగి: కోడి పందేలు, జూదాలు నిర్వహించే ఎనిమిది మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు తొండంగి ఎస్సై వినయ్‌ప్రతాప్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సంక్రాంతికి గ్రామాల్లో కోడి పందేలు, గుండాట వంటి జూదాలు నిర్వహించరాదన్నారు. ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కోరారు.

ఎస్ఈబీ దాడుల్లో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 23 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ప్రత్తిపాడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) సీఐ పి.అశోక్ తెలిపారు. ఏలేశ్వరం, శంఖవరం మండలాల్లో శుక్రవారం దాడులు నిర్వహించామన్నారు. ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లిలో ముద్దాడ నాగేశ్వరరావు నుంచి పది (డ్యూటీ పెయిడ్ లిక్కర్- 180 ఎంఎల్) మద్యం సీసాలను, శంఖవరం మండలం నెల్లిపూడిలో 13 మద్యం (180 ఎంఎల్) సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరు నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేసి, ఆయా మండలాల తహసీల్దార్ల వద్ద హాజరుపరిచినట్టు ఆయన చెప్పారు. ఏలేశ్వరంలో సారా విక్రయిస్తున్న ఓ మహిళను అరెస్టు చేసి ఆమె నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ దాడుల్లో సెబ్ ఎస్సై బి.వెంకటేశ్వరరావు, సెబ్ హెచ్‌సీలు వెంకన్నదొర, కృష్ణార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు

రౌతులపూడి: మండలంలోని మల్లవరం, రౌతులపూడి గ్రామాల్లో ఈ నెల 10 నుంచి నిర్వహిస్తున్న మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిశాయి. కబడ్డీ, వాలీబాల్ పురుషుల విభాగంలో ఎస్.అగ్రహారం, షటిల్ డబుల్స్ పురుషుల విభాగంలో ఎస్ఎస్ పట్నం, క్రికెట్ పురుషుల విభాగంలో పారుపాక జట్లు విజేతలుగా నిలిచారు. మహిళల విభాగంలో కబడ్డీ లచ్చిరెడ్డిపాలెం జట్టు, ఖోఖో, క్రికెట్, వాలీబాల్ క్రీడల్లో ములగపూడికి చెందిన జట్లు విజేతలుగా నిలిచాయి. విజేతలకు అధికారులు, నాయకులు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.గోవిందు, తాహసీల్దార్ బి.భీమారావు, డీటీ పీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్


పల్లపుచామవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వతపూర్ణచంద్ర ప్రసాద్

రౌతులపూడి: ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని పల్లపుచామవరంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదీవెన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను నిత్యం ప్రజల్లోనే ఉంటానన్నారు. ప్రజా సేవ చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం ఎం.చామవరం, శృంగవరం, బంగారయ్యపేట గ్రామాల్లో పర్యటించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాయి, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ తదితరుల పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత స్వామి వివేకానంద


యర్రవరంలో రక్తదానం చేస్తున్న యువకుడు

ఏలేశ్వరం: భారతదేశ గొప్పదనాన్ని ప్రపంచ దేశాలకు చాటిజెప్పిన స్వామి వివేకానంద జయంతి వేడుకలు నియోజకవర్గవ్యాప్తంగా శుక్రవారం ఘనంగా జరిగాయి. మండలంలోని పెద్దనాపల్లిలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ఆధ్వర్యంలో వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ యువత వివేకాందుని జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ వివేకానందుడు చూపిన సన్మార్గంలో నడవాలని కోరారు.

ఉచిత రక్తదాన శిబిరం

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరంలో శుక్రవారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. మండల వైద్యాధికారి శైలజ, రిటైర్డ్ వైద్యాధికారి ఏవీ రమణ దాతల నుంచి రక్తం సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణదానం చేయవచ్చన్నారు. యువత రక్తదానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

తుని: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. భారత వికాస్ పరిషత్ తుని శాఖ అధ్యక్షుడు లక్ష్మణాచార్యులు వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నేటి యువతకు వివేకానందుడు ఆదర్శప్రాయుడన్నారు. కార్యక్రమంలో భారత వికాస్ పరిషత్ కార్యదర్శి గాజుల వేణుగోపాలస్వామి, కోశాధికారి గౌరీ శంకరరావు, మాజీ అధ్యక్షుడు చదరం శివాజీ తదితరులు పాల్గొన్నారు.

షటిల్ టోర్నీ విజేత పిఠాపురం జట్టు

జగ్గంపేట: స్థానిక బాలుర వసతి గృహంలో నిర్వహించిన షటిల్ టోర్నమెంట్ విజేతగా పిఠాపురం టీమ్ నిలిచింది. ఈ నెల 8వ తేదీ నుంచి ఎంతో ఉత్సాహంగా పోటీలు నిర్వహించారు. శుక్రవారం అడ్డతీగల, పిఠాపురం టీమ్‌లు మధ్య ఫైనల్స్ మ్యాచ్ హోరాహోరీగా జరిగింది. విజేతలకు మొదటి బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.4 వేలను అతిథులు అందజేశారు. కార్యక్రమంలో జేవీఆర్ గ్రూప్‌లు అధినేత జీను మణిబాబు, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, పారిశ్రామిక వేత్త కర్రి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

తొండంగి: గ్రామానికి చెందిన విద్యుత్ షాక్ బాధితుడు లోవరాజుకు శ్రీస్ఫూర్తి ఫౌండేషన్, శ్రావణి సేవా సమితి స్వచ్ఛంద సంస్థలు ఆర్థికా చేయూత నందించాయి. వివరాల్లోకి వెళితే.. తొండంగికి చెందిన లోవరాజు కొంతకాలం క్రితం విద్యుత్‌షాక్‌కు గురై మంచానికే పరిమితమై ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న శ్రీస్ఫూర్తి ఫౌండేషన్, శ్రావణి సేవా సమితి బాధితుడికి రూ.10 వేలు ఏర్పాటు చేయగా ఆ నగదును ఎస్సై వినయ్‌ప్రతాప్ లోవరాజుకు అందజేశారు. స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు నేమాల శ్రీనివాసరావు, వెంకట్, శివ, కల్యాణ్, చందు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి భరోసా


యూజే పురంలో ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రత్తిపాడు రూరల్: ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని యూజే పురం గ్రామ సర్పంచ్ నడిగట్ల త్రిమూర్తులు అన్నారు. మండలంలోని యూజే పురంలో లబ్దిదారులకు ఎంపీటీసీ మేడసాని సింహాద్రితో కలిసి ఆయుష్మాన్ భారత్, ఆరోగ్య శ్రీ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంలో పేద ప్రజలు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా పొందుతున్నారన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

న్యాయవాదుల ఆందోళన

ప్రత్తిపాడు: ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం ప్రత్తిపాడులో ఆందోళన చేపట్టారు. ఐలాజ్ రాష్ట్ర అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ బుగత శివ ఆధ్వర్యంలో న్యాయవాదులు గ్రామంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బుగత శివ మాట్లాడుతూ ఈ చట్టం వల్ల సామాన్య ప్రజలు న్యాయానికి దూరం అవుతారన్నారు. ఈ చట్టం రద్దు కోరుతూ న్యాయవాదులు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఉద్యమానికి ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఐలాజ్ కమిటీ సభ్యురాలు అవసరాల దేవి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు ఆడారి సుగుణ, బార్ ప్రతినిధులు రాజాల చిట్టిబాబు, ఆకుల హరిబాబు, ఆయర్లా జిల్లా కార్యదర్శి మానుకొండ లచ్చబాబు, ఏపీ కిసాన్ సంఘ నాయకులు తాడి నాగేశ్వరరావు, జింక అప్పారావు, తూము చల్లబాబు తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. 20 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్షకుంకుమార్చన

ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండదిగువన కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు కంచిబట్ల సాయిరామ్ ఆధ్వర్యంలో పండితులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

ఘనంగా కూడారై ఉత్సవం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గోదాదేవి అమ్మవారికి అక్కారడిశెల్ పాయసం నివేదన, కూడారై ఉత్సవం నిర్వహించారు. అమ్మవారికి నివేదించిన పాయసం కుండలను శ్రీవారి నామం రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు గోదారంగనాథుల కల్యాణం

ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం గోదారంగనాథుల కల్యాణోత్సవం, అమ్మవారి సారే ఊరేగింపు, గోదాదేవికి మంగళస్నానం నిర్వహించనున్నారు. 14న రాత్రి ఏడు గంటలకు గోదారంగనాథుల దివ్య కల్యాణ మహోత్సవం వైభవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కోడి పందేలు ఆడితే కఠిన చర్యలు


కుమ్మరిలోవలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న సీఐ, తహసీల్దార్, ఎస్సైలు


కోడిపందేలు నిర్వహించే ప్రదేశంలో ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తున్న పోలీసులు

తుని రూరల్: సంక్రాంతిని పురస్కరించుకుని నియోజకవర్గంలో ఎక్కడైనా కోడి పందేలు, గుండాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ ఎ.సన్యాసిరావు హెచ్చరించారు. మండలంలోని కుమ్మరిలోవ, డి.పోలవరం, కొలిమేరు, వి.కొత్తూరు, తేటగుంట, రాజుపేట తదితర గ్రామాల్లో రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు శుక్రవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు కోడి పందేలు, గుండాట వంటి జూదాలు నిషేధించినట్టు తెలిపారు. నిర్వాహకులకు ముందస్తు నోటీసులు ఇచ్చామన్నారు. ఎవరైనా నిషేధిత ఆజ్ఞలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కోడి పందేల బరులను ధ్వంసం చేశామన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆటోలో మైక్ ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. సంక్రాంతి పండగ సెలవుల్లో ఇతర ఊళ్లకు వెళ్లేవారు తమ విలువైన వస్తువులు, నగలు, నగదు ఉంచారాదన్నారు. అనుమానితుల సంచారం ఉంటే సంబంధిత పోలీస్ స్టేషన్లకు తెలియజేయాలన్నారు. తహసీల్దార్ ఎల్.శివకుమార్, రూరల్ ఎస్సై విజయబాబు పాల్గొన్నారు.

జూదాల జోలికి పోవద్దు

గండేపల్లి: సంక్రాంతిని పురస్కరించుకుని యువత, ప్రజలు జూదాల జోలికి పోవద్దని స్థానిక ఎస్సై ఎస్.రామకృష్ణ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో కోడి పందేలు, గుండాటలకు అనువైన ప్రదేశాలను తహసీల్దార్ కేవీవీ సత్యనారాయణ, ఎంపీడీఓ రామన్, పశువైద్యాధికారి సుప్రియ, తదితరులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయా ప్రదేశాలలో కోడి పందేలు, గుండాటకు అనుమతులు లేవని తెలిపే ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సంక్రాంతిని ప్రతిఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలన్నారు. అనుమతులు లేని ఆటలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించరాదని గ్రామాల్లో మైక్ ద్వారా ప్రచారం చేశారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జూదాలకు దూరంగా ఉండాలి

ప్రత్తిపాడు: సంక్రాంతి పండగ నేపథ్యంలో ప్రజలు జూదాలకు దూరంగా ఉండాలంటూ పోలీసులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆటోలో మైక్ ద్వారా ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో కోడి పందాలు, గుండాట తదితర జూదాల నిర్వహించినా, గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయించినా దండన తప్పదని హెచ్చరించారు.

శంఖవరం: సంక్రాంతి సంబరాలు సందర్భంగా గ్రామాల్లో కోడిపందాలు, గుండాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నవరం ఎస్సై వి.కిశోర్ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం పలు గ్రామాల్లో ప్రచారం చేశారు.

రౌతులపూడి: సంక్రాంతి సందర్భంగా పేకాట, గుండాట, కోడిపందేలు వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రౌతులపూడి ఎస్సై అబ్దుల్ నబీ హెచ్చరించారు. ఈ మేరకు తాహసీల్దార్ బి.భీమారావు, డిటీ పీవీవీ సత్యనారాయణ, పశువైద్యాధికారి ఎం.వీరరాఘవరావులతో కలిసి రౌతులపూడిలో ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో దండోరా వేయించారు.

పండగకు జూదాలు ఆడితే చర్యలు తప్పవు

జగ్గంపేట: పండగ సందర్భంగా మండలంలో కోడి పందేలు, జూదం ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం గ్రామాల్లో మైకుల ద్వారా ప్రచారం చేశారు. రామవరం, జగ్గంపేట గ్రామాల్లో తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ వసంతకుమార్, పోలీసులు పర్యటించారు. పలు ప్రాంతాల్లో హెచ్చరిక బ్యానర్లు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో నెల 12 నుంచి 22వ తేదీ వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందని పోలీసులు తెలిపారు.